# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-10-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కృత్రిమ మేధస్సు ద్వారా ఓట్లను తొలగిస్తున్నారనేది అపోహ మాత్రమే అని పూర్వ ఉప రాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు.**

2. **మహిళల ఆర్థికాభివృద్ధికి సరస్ మేళా వేదిక కానుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.**

==========================

కృత్రిమ మేధస్సు ద్వారా ఓట్లను తొలగిస్తున్నారనేది అపోహ మాత్రమే అని పూర్వ ఉప రాష్ట్రపతి యం. వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులో ఆయన ఈరోజు దిల్లీలో జరుగుతున్న నిరసనపై పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధ సంస్థను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదన్నారు. గెలిస్తే తమ ఘనతని, ఓడిపోతే ఈవీఎంలను నిందించడం సరికాదని చెప్పారు. దేశవ్యాప్తంగా 13 కోట్లమంది ఓటర్లను తొలగించారనడం అవాస్తవమని వెంకయ్యనాయుడు తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

-------------------------

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అత్యవసర మంత్రివర్గ సమావేశం ఈ ఉదయం ప్రారంభమైంది. బీసీ రిజర్వేషన్ల ఉత్తర్వులను సుప్రీం కోర్టు కూడా కొట్టివేయడంతో ఈ అంశంపై చర్చించేందుకే ఈ అత్యవసర సమావేశం జరుగుతోంది.

-------------------------

మహిళల ఆర్థికాభివృద్ధికి సరస్ మేళా వేదిక కానుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో సరస్ ఆజీవికా మేళ-2026 కార్యక్రమ ఏర్పాట్లను పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి పరిశీలించారు. దేశవ్యాప్తంగా

స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు 600కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక వంటకాలతో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నామని, కుటుంబ సమేతంగా వచ్చే వారికి మేళా ప్రత్యేక అనుభూతిని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మేళాను ప్రారంభిస్తారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవతో దేశ సేవా' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 'ప్రభుత్వ సేకరణలో డిజిటల్ పారదర్శకత' గురించి ఈ రోజు తెలుసుకుందాం.

ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు చిన్న వ్యాపారాలకు అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) కీలకంగా మారింది. 2016 ఆగస్టు 9వ తేదీన ప్రారంభమైన ఈ ఆన్‌లైన్ వేదిక ద్వారా 2026 ఆగస్టు నాటికి మొత్తం లావాదేవీల విలువ 20 లక్షల కోట్ల రూపాయలను దాటింది. ఈ వేదికపై 3కోట్ల 70 లక్షలకు పైగా ఆర్డర్లు నమోదయ్యాయి. గతంలో ప్రభుత్వ కొనుగోళ్లు వివిధ శాఖల టెండర్లు, ధరల ఒప్పందాలు, మధ్యవర్తుల ద్వారా జరిగేవి. దీనివల్ల కొనుగోళ్ల ప్రక్రియలో జాప్యం, పోటీకి పరిమితులు ఏర్పడేవి. ఈ సమస్యలను అధిగమించేందుకు జీఈఎం ఒకే ఆన్‌లైన్ వేదికను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఈ వేదిక ద్వారా వస్తువులు, సేవలను కొనుగోలు చేస్తున్నాయి. వ్యక్తిగత వ్యాపారులు, చిన్న సంస్థలు సైతం మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా ప్రభుత్వానికి తమ ఉత్పత్తులను విక్రయించవచ్చు. ధరలు, ఉత్పత్తుల వివరాలు, విక్రేతల సమాచారం అందుబాటులో ఉండటంతో కొనుగోళ్లలో పారదర్శకత పెరిగింది. ఈ వేదికపై జరిగిన మొత్తం లావాదేవీల విలువలో సూక్ష్మ, చిన్న సంస్థల వాటా 45 శాతానికి పైగా ఉంది. ప్రభుత్వ కొనుగోళ్లలో చిన్న వ్యాపారాల భాగస్వామ్యాన్ని పెంచడంలో జీఈఎం కీలక పాత్ర పోషిస్తోంది.

---------------------------

పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పారిశుధ్య పరిస్థితులు, మంచినీటి సరఫరా పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు మండలం కొత్తవలస గ్రామంలో సుమారు 30 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన, గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మెరుగైన వైద్య

సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

---------------------------

వైద్య ఖర్చుల నిమిత్తం పేద కుటుంబాలకు అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 50 మంది లబ్ధిదారులకు 31 లక్షల 34 వేల 707 రూపాయల విలువైన చెక్కులను ఆయన ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఈ సాయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 579 మందికి 5 కోట్ల 19 లక్షల 34 వేల 509 రూపాయల చెక్కులు అందించినట్లు వెల్లడించారు.

---------------------------

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు టీ20 సిరీస్‌లో భాగంగా మూడో టీ20 మ్యాచ్ రేపు ప్రారంభం కానుంది. ఇండోర్ లోని హోల్కర్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ మొదలు కానుంది. ఇప్పటి వరకు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో భారత్, వెస్టిండీస్ చెరొక మ్యాచ్ గెలిచాయి. రేపు జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు సిరీస్ కైవసం చేసుకుంటుంది.

---------------------------

మానసిక సమస్యలపై అవగాహన పెంచడం కోసం ఈరోజు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రపంచ సమాఖ్య చొరవతో ప్రతి ఏటా అక్టోబర్ 10వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మొదటి సారిగా 1992వ సంవత్సరం అక్టోబర్ 10వ తేదీన నిర్వహించారు. మానసిక ఆందోళన కుంగు బాటు ఫోబియా వంటి రుగ్మతలన్నీ మానసిక అనారోగ్యానికి చిహ్నాలు. మానసిక వైద్య నిపుణుల ద్వారా ఈ రుగ్మతలకు తగిన చికిత్స పొందవచ్చు. అనునిత్యం యోగాభ్యాసం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

కన్యాకుమారి ప్రాంతం నుంచి ఉత్తర అంతర్గత కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణలో ఉత్తర, తూర్పు దిశల నుంచి గాలులు వీస్తున్నట్లు వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు వెల్లడించారు. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూలిన జల్లులు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

=====================